# ఈ తరం తండ్రి

## జూపిటర్

సాయంత్రం అయిదున్నర అవుతోంది. ఆఫీసు నుండి బయటకు వచ్చాను. మా ఇల్లు ఆఫీసుకు దగ్గరే అవడంతో రోజూ నడుచుకొంటూనే వెళ్లివస్తాను.

రోడ్డుమీద నడుస్తున్నానన్నమాటేగానీ ... నా ఆలోచనలన్నీ 'రేవంత్' చుట్టూనే తిరుగుతున్నాయి. అసలివాళ నా మనసంతా చిరాగ్గా ఉంది. దానికి కారణం 'రేవంత్' బి. ఎ. మొదటి సంవత్సరం పరీక్షల్లో తప్పడం కావచ్చేమో ?

పదహారేళ్ల క్రితం వరకూ... నా చేతుల్లో గంతులు వేసిన రేవంతుకు ఇవాళ నేనంటే ఏమాత్రం లక్ష్యం లేదు ! నా ప్రతి మాటకూ ఎదురు చెప్తాడు—వాడికి ఎందరో స్నేహితులు ! నేనిచ్చే—వందరూపాయల పాకెట్ మనీ సరిపోదంటాడు. ఇంట్లో వాళ్లమ్మని కూడా లెక్కచెయ్యడు.

మాకు రేవంత్ ఒక్కడే సంతానం కావడంతో...వాడిని ఎంతో గారాబంగా పెంచడం వల్ల ... వాడితో గట్టిగా మాట్లాడలేకపోతున్నాను. చూస్తుంటే... వాడి ముందు నేనో అసమర్థుడిగా ప్రవర్తిస్తున్నానన్పిస్తోంది.

ఏమయినా ఇవాళ వాడితో గట్టిగా మాట్లాడాలని నిశ్చయించుకున్నాను.

''ఇంకా ఆలోచించడానికి ఏమీలేదుగా'' — అన్నట్టు ఇల్లు వచ్చేసింది.

తలుపు తీసిన శాంతను, ''రేవంత్ ఇంట్లో ఉన్నాడా ?'' అని అడిగాను.

''వాడు ఇంటికి ఎప్పుడొచ్చేదీ మీకు తెలియదా ?'' అంటూ నావంక వింతగా చూసింది శాంత.

''ఓ, దొరగారు తొమ్మిదయితేగానీ రారు కదూ ?'' గొణుక్కుంటూ లోపలికి నడిచాను.

స్నానంచేసి, టీ తాగి, పడకకుర్చీలో కూర్చోగానే, మళ్ళీ రేవంత్ వైపుకు నా ఆలోచనలు పయనించాయి.

నేను 'డల్'గా ఉన్నట్టు అన్పిస్తే శాంత నన్ను కదిలించదు ! తనుకూడా రేవంత్ గురించే ఆలోచిస్తూ ఇంకోమూల కూర్చుంది.

కాలింగ్ బెల్ మోగింది. మేమిద్దరం... మా ఆలోచనలనుంచి బయటపడి ఈ లోకంలోకి వచ్చాం. శాంత లేచి వెళ్ళి తలుపు తీసింది.

రేవంత్ వచ్చాడు. వాడిని ఏదో అడుగుదామని అనిపించినా... నా నోరు పెగలలేదు.

తలుపు తీసింది... ఎవరోకూడా గమనించనంత వేగంగా... ఈలవేస్తూ ... లోపలికి పెద్ద... పెద్ద... అంగలతో నడిచాడు రేవంత్.

నాకు అంతా తమాషాగా ఉంది. నేనున్నది నా యింట్లోనేనా అన్పించింది నాకా క్షణంలో !

''అసలు నేను నా కొడుకుతో మాట్లాడటానికి... ఇంతగా రిహార్సల్ వేసుకోవాల్సిన అవసరం ఏమిటి ? ఆఫీస్‌లో డివిజనల్ మానేజర్‌తో మాట్లాడాలన్నా... నేనింతగా ఎప్పుడూ మథనపడనే...!'' నామీద నాకే అసహ్యం వేసింది.

రేవంత్ తన గదిలోకి వెళ్ళిపోయి బట్టలు మార్చుకొంటున్నాడు. నెమ్మదిగా వాడి గదివైపు వెళ్ళి... గుమ్మంలో నిలబడ్డాను.

నన్ను చూసి కూడా ... చూడనట్లుగా టేబుల్ మీద ఉన్న పుస్తకాల్ని సర్దసాగాడు రేవంత్.

''రేవంత్ ! నీతో మాట్లాడాలి ! త్వరగా స్నానం చేసి నా గదిలోకి రా !'' గబగబా అనేసి వెనుదిరిగాను.

''ఆ మాటలేవో భోజనాలు ముగించాక మాట్లాడుకోండి. నేను వడ్డించేస్తున్నాను !' అంటూ వంటింట్లోంచి అంది శాంతి !

''డాడీ... ఇవాళ ప్రత్యేకంగా నాతో ఏం మాట్లాడతాడట ?'' తనలో తానే అనుకొంటూ బాత్‌రూం వైపు నడిచాడు రేవంత్.

భోజనాల దగ్గర ఎవరమూ మాట్లాడటానికి అవకాశం రాలేదు! అందరం తలవంచుకొని మా పని అయిపోయిందనిపించేశాం !

చెయ్యి కడుక్కొని నా గదిలోకి నడిచాను. నా వెనకే రేవంత్ కూడా వచ్చాడు.

''నన్నెందుకు పిల్చారు డాడీ ?'' రేవంత్ అడిగాడు.

''ఆ కుర్చీలో కూర్చో !'' అంటూ వాడిని కూర్చోమని నేను కూడా కూర్చున్నాను.

''రేవంత్ ! నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలని పిల్చాను!'' సంభాషణ మొదలుపెట్టాను

తల వంచుకొని కూర్చున్నాడు రేవంత్.

''ఇవాళ నీ రిజల్ట్స్ చూసాను. నువ్వు తప్పినందుకు నేను బాధపడటంలేదు ! నువ్వు మామూలుగా తప్పితే ... మళ్ళీ సెప్టెంబర్‌కు కట్టి పాసవుతావని పూర్కొని ఉండేవాడిని. కానీ నీ ప్రవర్తన నాకు నచ్చడం లేదు. నువ్వు స్నేహితులతో సినిమాకనీ, షికార్లకనీ తిరుగుతున్నట్లు తెలిసింది. ఈ మధ్య సిగిరెట్లుకూడా కాలుస్తున్నావని ఎవరో చెప్పారు. చదువుకొని వృద్ధిలోకి రావల్సిన ఈ వయసులో ... ఇలా చెడు తిరుగుళ్ళు తిరగడం ... మంచిది కాదు ! అసలు నీ గురించి నువ్వేమనుకొంటున్నావ్ ?''

జవాబు లేదు ...

''నేనూ, అమ్మా...నిన్ను ఎంతో అల్లారుముద్దుగా పెంచాం. చిన్నప్పుడు నువ్వడిగిన ప్రతి వస్తువూ నిముషాల్లో తెచ్చియిచ్చాను. మాకున్నది ... నువ్వొక్కడివే ... అనే దృష్టితో నిన్నుఎపుడూ కసురుకోనుకూడా లేదు! నువ్వెంత డబ్బు అడిగినా ... ఎందుకూ అని అడగకుండా ఇచ్చాను ! అయినా నేనంటే నీకే మాత్రం గౌరవం ఉన్నట్టు నువ్వు ప్రవర్తించడంలేదు. మీ అమ్మతో కూడా నువ్వు సరిగ్గా మాట్లాడటం లేదట !'' ఒక్కక్షణం ఆగి ... వాడినుండి జవాబేమయినా వస్తుందేమోనని చూశాను. కాలివేళ్ళను నేలమీద రాస్తూ కూర్చునివున్నాడు రేవంత్.

''ఎందుకురా రేవంత్ ! మా యిద్దర్నీ ఇలా బాధపెడ్తావ్ ? మాకున్నది నువ్వొక్కడివిరా ! నువ్వు మంచిగా చదువుకొని వృద్ధిలోకి వస్తే... నిన్నుచూసి సంతోషించాలని మాకుంటుందని నీకు అన్పించదా ?''

''..................''

''నీ వయసులో... నేను ఇలా ఉండేవాడివా? మా నాన్నని పరీక్ష ఫీజుకు డబ్బు ఇమ్మని అడగాలన్నా... ఎంతోభయంగా అడిగేవాడిని ! స్కూలు, కాలేజీ, ఇల్లూ — తప్ప నాకింకో లోకమే ఉండేది కాదు ! ఇంటిదగ్గర రోజుకి ఏడెనిమిది గంటలు చదివేవాళ్ళం ! మా అమ్మ.. ప్రతి రోజూ స్కూల్లో చెప్పిన పాఠాలు అప్పజెప్పందే ... అన్నంకూడా పెట్టేది కాదు ! ప్రతిసారీ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వగానే... సంతకం పెట్టడానికి మా నాన్న ఎంతో హడావుడి చేసేవాడు. ఏ సబ్జక్టులోనయినా తక్కువ మార్కులు వస్తే... రెండు వందల గుంజీలు తీయిస్తూ ఉండేవాడు. మరి నీకో ! నేనెంత స్వేచ్ఛ ఇచ్చాను ! ఏ విషయంలోనూ నీకు నేను అడ్డం రాలేదు ! అయినాకూడా... మేమంటే నీకే మాత్రం లక్ష్యం ఉండటంలేదు !'' కొద్దిగా ఆవేశంగానే అన్నాను.

అప్పటివరకూ తల వంచుకొని కూర్చున్న రేవంత్ ఒక్కసారిగా తలఎత్తి నా కళ్ళలోకి చూశాడు.

''డాడీ ! నన్ను మీరడిగిన ప్రశ్నకు జవాబు కూడా మీ ప్రశ్నలోనే ఉంది !'' నెమ్మదిగా అన్నాడు రేవంత్.

''అంటే... '' నాకు అర్థంకాలేదు వాడి జవాబు.

''అవును డాడీ! మీరు నన్నెంతో గారాబంగా పెంచారు. నేను అడిగిన ప్రతిదీ... కొనిపెట్టారు.

ఎప్పుడు డబ్బు అడిగినా... లేదనకుండా ఇచ్చారు. స్కూలుకు వెళ్ళినా వెళ్ళకపోయినా ... ఏమీ అనే వారు కాదు! ప్రోగ్రెస్ రిపోర్టు చూపించినప్పుడు దాని వంక చూడనయినా చూడకుండా సంతకం పెట్టేవారు ! చిన్నప్పుడు ... నేను అల్లరి చేస్తుంటే ... దాన్ని చూసి సంబర పడేవారే తప్ప... ''తప్పు బాబూ! అలా చెయ్యకూడదని''



— నన్ను మందలించ లేదు ! ఇన్నాళ్ళూ నాకు అనవసరంగా స్వాతంత్ర్యం ఇచ్చి నన్ను ఇలా తయారు చేసి, ఇవాళ ''పాడయిపోతున్నావు బాబూ !'' అంటే... నేను క్షణాల్లో మారిపో గలనా ? మీరు ... మీ రోజుల్లో చిన్నప్పుడు శ్రద్ధగా చదివారూ అంటే దానికి కారణం ... మా బామ్మా, తాతగారూ ! వాళ్ళు మిమ్మల్ని ఎంతో భయభక్తుల్లో చదివించారు ! అందువల్లే చిన్నపుడు మీరలా ఉండగల్గారే తప్ప... అది మీ ఒక్కరి గొప్పతనం మాత్రం కాదు ! మిమ్మల్ని అలా క్రమశిక్షణలో పెంచిన మా 'బామ్మ', తాతగార్ల గొప్పదనం ! మరి మీరు తండ్రిగా నాకేం చేశారు ? అమ్మ కూడా నాకు మూడు పూటలా అన్నం పెడుతుందే తప్ప... ఏనాడయినా, ''ఎలా చదువుతున్నావురా ?'' అని అడిగిందా ? ఇన్నాళ్ళు మీరిద్దరూ నాగురించి ఏమీ పట్టించుకో లేదు! అందువల్లే నీవిలా తయారయ్యాను !'' ప్రతి మాటా కూడబలుక్కుంటూ అన్నాడు రేవంత్.

రేవంత్ నోటినుండి వచ్చిన ప్రతి మాటా నాకు బాణాల్లా గుచ్చుకున్నాయి. వయసులో చిన్నవాడయినా... వాడు నా బాధ్యతను నాకు తెలియజేసాడన్పించింది.

రేవంత్‌కు నేను బదులు చెప్పలేకపోయాను. దానికి కారణం...నావద్ద వాడి ప్రశ్నలకు జవాబు లేకపోవడమే !

★